దోమ చిన్నది.. ప్రమాదం పెద్దది



• జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ • నేడు ప్రపంచ దోమల దినోత్సవం



దోమల నివారణపై ప్రచారం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది





మలేరియా వ్యాధిని కనుగొన్న సర్ రోనాల్డ్ రాస్



సీతంపేట: దోమే కదా అని చిన్న చూపు చూస్తే ప్రాణాలు హరించేస్తుంది. ప్రపంచాన్ని జయించిన గొప్ప చక్రవర్తి అలెగ్జాండర్ దోమ కాటు వల్ల 32 ఏళ్లకే మరణించారు. భారత్‌పై దండెత్తిన సమయంలో దేశ సరిహద్దుల్లో దోమ కాటుకు గురై అలెగ్జాండర్ మలేరియా వ్యాధి సోకి మరణించారని చరిత్ర చెబుతోంది. ప్రపంచాన్ని గెలిచిన అంత గొప్ప చక్రవర్తిని ఒక చిన్న దోమ మట్టుపెట్టిందంటే, దోమ శక్తి ఏంటో ఒకసారి ఆలోచించండి. పాము కాటు కంటే దోమ కాటు ప్రమాదం అని గ్రహించడం మేలు. దోమే కదా అని అజాగ్రత్తగా ఉంటే తగిన మూల్యం చెల్లించక తప్పదు. ప్రపంచంలోని దాదాపు 106 దేశాలను దోమలు వణికిస్తున్నాయి. మన ఇంటిలో కూడా ఎవరో ఒకరు దోమ బారిన పడ్డవారే. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. ప్రతి ఏటా ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటారు. బ్రిటీష్ డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మానవులకు వ్యాపిస్తుందని కనుగొన్నాడు. దానిని గుర్తు చేసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ రోజును ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుతున్నారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి పేర్లు వినని వారు ఉండరు. దోమ వల్ల వ్యాపించే ప్రాణాంతకమైన జ్వరాలు ఇవి. చిన్న దోమ ఎంత పెద్ద ప్రమాదాన్ని తీసుకువస్తుందో చెప్పడానికి ఈ జ్వరాలే ఉదాహరణ. చిన్న దోమ కాటుతో మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకరమైన జ్వరాల బారిన పడి మరణానికి కూడా చేరువైన సంఘటనలు కోకొల్లలు.

జనాభాకు తగ్గట్లు దోమల వ్యాప్తి..

పెరుగుతున్న జనాభా, అరకొర సౌకర్యాలు, ఇరుకు నివాసాలు, అవసరార్థం ఏర్పాటు చేసుకున్న నీటి నిల్వలు, పేరుకుపోతున్న అపారిశుధ్యం వెరసి నగర జనాభాకు సమాంతరంగా దోమలు విజృంభిస్తున్నాయి. ఇవే మలేరియా, డెంగ్యూ జ్వరాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. భారతదేశంలో 400 రకాలకు పైగా దోమలు వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి. అందులో ముఖ్యంగా ఎనాఫిలిస్, ఈడిస్, క్యూలెక్స్ దోమలు కుట్టడం వల్ల ప్రాణాంతకమైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా ఫీవర్, జపనీస్ ఎన్‌సెఫలైటిస్, లింఫాటిక్ ఫైలేరియాసిస్ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

ఆడ దోమలే ప్రమాదకరం...

మగ దోమలు చెట్ల రసాలను పీల్చి బతుకుతుంటాయి. ఆడ దోమలు మాత్రం సంతానాన్ని అభివృద్ధి చేసుకోవడంలో భాగంగా గుడ్లు పెట్టడానికి మనిషి రక్తాన్ని పీల్చుతుంటాయి. ఈ క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ రక్తాన్ని పీల్చినపుడు రక్తంతో పాటు వ్యాధి కారకమైన పారసైట్ దోమ లాలాజల గ్రంథుల్లోకి చేరుతుంది. అక్కడ పారసైట్‌లో కొన్ని మార్పులు జరుగుతాయి. మరొక ఆరోగ్యవంతమైన వ్యక్తిని దోమ కుట్టినపుడు లాలాజలంతో పాటు పారసైట్ మనిషి రక్తంలో చేరి వ్యాధులు కలుగ జేస్తాయి.

దోమల వృద్ధిని అరికట్టేదెలా?

దోమ ఎగురుతున్నప్పుడు పట్టుకోవడం, చంపడం చాలా కష్టం. ఒక్క దోమను పట్టుకోవాలంటే ఎంతో శ్రమించాలి. కానీ దోమలు నీటిలో లార్వా, ప్యూపా దశలో పెరుగుతున్నపుడు గుర్తించి వాటిని నాశనం చేయడం చాలా సులువైన పని. ఇంటిలో నీటిని నిల్వ చేసే గోలాలు, కుండీల్లో చిన్న చిన్న పురుగుల్లా కన్పిస్తుంటాయి. వాటిని చాలా మంది నీటి పురుగులు, జలగలు అని పిలుస్తుంటారు. ఇలా దోమ పిల్లలు (లార్వా) నిల్వ నీటిలో ఉన్నట్టయితే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి. ఇలా చేయడం వల్ల లార్వా, ప్యూపాలను పదులు, వందల సంఖ్యలో నాశనం చేయవచ్చు. లేదా ఇంటికి వచ్చే జీవీఎంసీ సిబ్బంది వేసే అబేట్, బీటీఐ, టిమోఫాస్ వంటి మందులను నీటి నిల్వల్లో వేయించడం ద్వారా లార్వాను నాశనం చేయవచ్చు. దోమల నియంత్రణ పద్ధతులపై ప్రజలు అవగాహన పెంపొందించుకుంటే ఎంతో సులువుగా వాటిని నియంత్రించవచ్చు.

- మలేరియా ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల, డెంగ్యూ, చికున్ గున్యా జ్వరాలు ఈడిస్ దోమ కుట్టడం వల్ల, క్యూలెక్సు దోమ వల్ల బోధకాలు వ్యాధి సంభవిస్తుంది.
- నిల్వ ఉన్న మంచి నీరు, వర్షపు నీరు, మురుగు నీటిలో దోమలు గుడ్లు పెట్టడం ద్వారా తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయి.

దోమలు వృద్ధిచెందే ప్రదేశాలు...

- జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాల కారణంగా రోడ్ల పైన, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, రుబ్బురోళ్లలో నీరు నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయి.
- నీటి గోలాలు, కుండీలు, ట్యాంకులు, సంప్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులలో నీటిని నిల్వ చేయడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాపింప జేస్తాయి.

దోమల నియంత్రణ ఇలా...

- దోమలు నిల్వ ఉన్న మంచి నీరు, వర్షపు నీటిలో పెరుగుతాయి కాబట్టి గోలాలు, కుండీలు, ట్యాంకులు, సంప్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులను వారానికి ఒకసారి 'డ్రై డే'గా పాటించి శుభ్రపర్చుకోవాలి.
- ఇంటి ఆవరణలో కొబ్బరిచిప్పలు, పాత టైర్లు, సీసాలు, ఎయిర్ కూలర్లు, ఫ్లవర్ వాజ్‌లు, మనీ ప్లాంటు మొక్కల కుండీలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- సెప్టిక్ ట్యాంకు గొట్టాలకు ఇనుప జాలీ బిగించాలి.
- ఇంటికి వచ్చే యాంటీ లార్వా సిబ్బందికి సహకరించి నిల్వ నీటిలో మందు వేయించాలి.
- దోమ తెరలు వాడటం అలవాటు చేసుకోవాలి

దోమల వృద్ధి ఇలా...

దోమలు నిలువ ఉన్న మంచినీరు, వర్షపు నీటిలో గుడ్లు పెడుతుంటాయి. ఒక దోమ 100 నుంచి 200 గుడ్లు పెడుతుంది. ఇవన్నీ కేవలం 8 నుంచి 10 రోజుల్లో దోమలుగా మారిపోతాయి. గుడ్ల నుంచి లార్వా, ప్యూపా, అడల్ట్ మస్కిటోగా రూపాంతరం చెందుతాయి.



దోమ జీవిత చక్రంలోని దశలు

జోన్-5 ఏసీపీగా తిరుపతిరావు



తిరుపతిరావు

కంచరపాలెం: జ్ఞానాపురం జోన్-5 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా ఎం.తిరుపతి రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శాస్త్రి జీవీఎంసీ జోన్-2కు ఏసీపీగా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ తిరుపతిరావు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతిరావు మాట్లాడుతూ జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. టౌన్ ప్లానింగ్ టీపీవోలు, సచివాలయ టీపీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

ప్రమాదకరంగా చెట్టు



లలితానగర్‌లో కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో తిరుపూర్ గార్మెంట్స్ షాపు వద్ద ఒక చెట్టు ప్రమాదకరంగా మారింది. చెట్టు మొదలు భాగం చెదలు పట్టడంతో ఏ క్షణంలోనైనా కూలడానికి సిద్ధంగా ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చెట్టు వాలిపోవడంతో దాని కొమ్మలు రోడ్డుపై వేలాడుతూ, గాలి వీస్తే కేబుల్ వైర్లు, విద్యుత్ వైర్లకు తగులుతుండటంతో అవి తెగిపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏ క్షణంలోనైనా చెట్టు కూలిపోయే ప్రమాదం ఉందని, ఈ మార్గంలో ఉన్న లలితమ్మ గుడికి నిత్యం భక్తులు వస్తుంటారని, ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని సందేహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత విభాగం అధికారులు స్పందించి కూలక ముందే చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉమానీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉమానీలకంఠేశ్వరుడు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామారావు శర్మ మహేష్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, ఫలరస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బండారు ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శంకరమఠానికి చెందిన పి.రాంబాబు రూ.లక్ష 11వేల 116 విరాళాన్ని మంగళవారం అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశా రు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మద్రిపాలెం: హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం మద్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి సిబ్బందితో కలిసి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ఇద్దరూ హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన

మురళీనగర్: పరిశ్రమల స్థాపన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగం అనే అంశంపై కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ల్యాబ్ కార్ప్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున కొరిపాడు పాల్గొని ప్రసంగించారు. పరిశ్రమల అవసరాలు అందుకు అనుగుణంగా విద్యార్థులు నేర్చుకోవాల్సిన అంశాలు, కృత్రిమ మేధస్సుతో భవిష్యత్ ఉద్యోగావకాశాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీడీ పూర్వ చైర్మన్ డాక్టర్ ఒఎం రావు, ప్రొఫెసర్ సాంబశివరావు, కార్యదర్శి డాక్టర్ ముఖేష్ పాల్గొన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తరశతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రా లను అందించారు.

రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు



రౌడీషీటర్‌ను విచారిస్తున్న సీఐ రవికుమార్

మద్రిపాలెం: వన్‌టౌన్ ఏరియాలో ఇటీవల జరిగిన కాల్పుల నేపథ్యంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ల ఇళ్లలో పోలీసులు మంగళవారం ఉదయం 4 గంటల సమయంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. యాక్టివ్‌గా ఉన్న సుమారు 12 మంది రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు నిర్వహించి వారిని విచారించారు. కంచరపాలెం శ్రీనగర్ రైతు బజార్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మణికంఠ (30) వద్ద రెండున్నర కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

తాటిచెట్లపాలెం: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్ల ఇళ్లల్లో ఇన్‌స్పెక్టర్ ఉమాకాంత్ నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేశారు. వన్‌టౌన్ పోలస్ స్టేషన్ పరిధిలో జరిగిన కాల్పుల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్లలో గల రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాలలో ఏ విధమైన ఆధారాలు, విశేషాలు లేవని పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో 6 కేజీల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో మంగళవారం రైల్వేపోలీసులు నిర్వహించిన తనిఖీలలో గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ మహిళా ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ కెళ్లి అనంతరావు సిబ్బందితో ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహిస్తుండగా తిరువల్లూరు జిల్లా తమిళనాడు రాష్ట్రానికి చెందిన అరుణ్‌కుమార్ బి. విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని రూ. 30 వేల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు.

కొండవాలులో రక్షణకు వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ వార్డు కార్పొరేటర్ గంకల కవిత మంగళవారం పీజీఆర్‌ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు, మేయర్ పీలా శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. భారీ వర్షాల దృష్ట్యా కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వార్డులో సీసీ కెమెరాలు, నూతన సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, అదనపు పారిశుధ్య కార్మికుల నియామకం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కవిత


కొనసాగుతున్న ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీలు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర వైద్యులు మంగళవారం నగరంలోని పలు ఐవీఎఫ్ సెంటర్లను తనిఖీ చేశారు. గిగ్లెస్ ఒమ్ని ఆర్కే, నోవా ఐవీఎఫ్, లాన్సెట్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రికార్డులు, ఇతర పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారు వంటి వివరాలను డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. అలాగే స్కానింగ్ గది బయట, లోపల, రిసెప్షన్‌లో ధరల పట్టికను, ఇతర బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, ప్రతీ ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఫారం-ఎఫ్‌పై గర్భిణి, స్కానింగ్ చేసే వైద్యుడి సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను స్కానింగ్ గదిలో ప్రదర్శించాలని, స్కానింగ్ యంత్రాలను మార్చరాదన్నారు. నిర్దేశించిన గడువు కంటే రెండు నెలల ముందుగానే రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

సేవా కార్యక్రమాలకు ప్రణాళిక



మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ప్రణాళిక తయారు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. వాకర్స్ పార్కులో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ఉచిత వైద్య శిబిరం, 25న మట్టి వినాయకులు, వినాయక వ్రతకల్పం పుస్తకాల పంపిణీ, 31న మిమిక్రీ, మ్యాజిక్ షో, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

విమానాల రూపకల్పనలో డిజైన్ థింకింగ్ కీలకం



ప్రొఫెసర్ పదాల్‌ను సత్కరిస్తున్న ఎఫ్‌డీపీ ప్రతినిధులు



పాల్గొన్న పాలిటెక్నిక్ ఫ్యాకల్టీ

మురళీనగర్: విమానాల రూపకల్పనలోని వైఫల్యాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు డిజైన్ థింకింగ్ విధానం ఉపయోగపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.టి.బి.పదాల్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్‌పై జరిగిన శిక్షణలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొని రెండవ రోజు ఉన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానాల డిజైన్‌లో సంఖ్యా పద్ధతు ల ప్రాముఖ్యత, క్రిస్టలాగ్రాఫికల్ వైఫల్యాలు, వాటి పరిష్కారాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. రాఘవ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ హేమలత మాట్లాడుతూ మల్టీ-క్రైటీరియా డెసిషన్ మేకింగ్ (ఎంసీడీఎం) అప్రోచ్ ప్రాముఖ్యతను వివరించారు. బహుళ ప్రమాణాల ఆధారంగా కచ్చితమైన డిజైన్ ఎంపిక, సమస్య పరిష్కారం, పరిశోధనాత్మకత దిశలో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను ఉదాహరణలతో వివరిస్తూ, ఈ పద్ధతిని ఎఫ్‌డీపీకి అనుసంధానించే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేటీబీ పదాల్‌ను సత్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ రాజు, కో-కోఆర్డినేటర్ ఎం.భరణి పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా గోతులు



శంకరమఠం రోడ్డులో ఇన్‌కం ట్యాక్స్ ఆఫీస్ ఎదుట ఏర్పడిన గొయ్యి



రామలింగేశ్వరాలయం ఎదుట ప్రమాదకరంగా ఉన్న గొయ్యి



మధురానగర్ రోడ్డులో శిథిలమైన కల్వర్టు

సీతంపేట: కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ప్రధాన రహదారుల్లో గోతులు పూడ్చకుండా సంబరాలు చేసుకుంటున్నారని జనం విమర్శిస్తున్నారు. హైవే నుంచి డైమండ్ పార్కుకు వెళ్లే శంకరమఠం ప్రధాన రహదారిలో పలు చోట్ల గోతులు ప్రమాదకరంగా మారాయి. ఒకవైపు కురుస్తున్న వర్షాలు, మరొక వైపు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో నోరు తెరుచుకున్న గోతులతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాల్లో గోతులు సరిగా కనపడగా నిత్యం ఎవరో ఒకరు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక మూడు నెలల్లో గోతులు పూడ్చుతామని హామీ ఇచ్చారు. ఏడాది పాలన పూర్తయినా గోతులు మాత్రం ఇంకా పూడ్చకుండా వదిలేశారని జనం మండిపడుతున్నారు. శంకరమఠం రోడ్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం ఎదుట 50-92-35 డోరు నంబరు వద్ద ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. అలాగే అదే రోడ్‌లో రామలింగేశ్వరాలయం ఎదురుగా ఏర్పడిన గొయ్యి, విజయగణపతి ఆలయం ఎదురుగా మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా ఉంది. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే మార్గాలలో గోతులు పూడ్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా.. దొండపర్తి డైమండ్ పార్క్ సమీపంలో గల మేడిచెర్ల అపార్ట్‌మెంట్‌లో సీహెచ్ రాము వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఇతని చిన్న కుమారుడు సీహెచ్ దుర్గాప్రసాద్ (30) మద్యపానం, ఇతర చెడు అలవాట్లకు బానిసయ్యాడు. రెండేళ్లుగా భార్యతో కూడా సరైన సంబంధాలు లేక జీవితం మీద విరక్తితో అదే అపార్ట్‌మెంట్‌లో గల బాత్‌రూంలో మంగళవారం తెల్లవారి 1 గంట సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యూజీడీ లీకుతో అవస్థలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుక వైపు గల మెయిన్‌రోడ్‌లో యూజీడీ లీకవుతోంది. మంగళవారం ఉదయం నుండి ఇదిలా లీకవతుండడంతో స్థానికుల, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ మురుగు నీరు పోలీస్‌స్టేషన్ వరకు ప్రవహించడంతో దుర్వాసన, రోడ్డంతా మురుగుతో నిండిపోయింది. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వెనుక వైపు మ్యాన్‌హోల్ లీకేజీ